క్లుప్తంగా

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ(మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తున్న నరసాపురం ఆర్డీఓ దాసి రాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలు నుంచి కార్యక్రమంలో ప్రారంభం అవుతుందని వివరించారు.

విద్య అవసరాన్ని గుర్తించాలి

నరసాపురం: విద్య అవసరాన్ని గుర్తించి పిల్లలు బాగా చదువుకోవాలని బీజీబీఎస్ మహిళా కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అమ్మాజీ సూచించారు. స్థానిక గ్రేడ్-1 శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో అమ్మాజీ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

అనారోగ్య బాధితులకు సాయం అందజేత

యలమంచిలి: పట్టణంలోని లజపతిరాయపేటకు చెందిన పేరిచర్ల మణికంఠ వర్మకు ప్రమాదవశాత్తూ కాలు విరిగింది. అతను వైద్యం చేయించుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఇతని పరిస్థితిని తెలుసుకున్న వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు అతని వైద్యానికి రూ.ఏడు వేల చెక్కును పంపగా వసుధ ఫౌండేషన్ పాలకొల్లు శాఖ కన్వీనర్ పెన్మత్స బుద్ధరాజు, భూపతిరాజు అనంతలక్ష్మీ ఆదివారం బాధితునికి అందజేశారు.



మణికంఠ వర్మకు చెక్కు అందజేస్తున్న పెన్మత్స బుద్ధరాజు

మందుల వితరణ

యలమంచిలి: పోడూరు మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన గుబ్బల రాజేశ్వరి (43) గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుంది. ఆమెకు మందులు కొనేంత ఆర్థిక స్థోమత లేకపోవడం సహాయం కోసం రోటీరి క్లబ్ వారిని సంప్రదించింది. దీంతో రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ప్రెసిడెంట్ రావాడ సతీష్, శ్రీ లక్ష్మీ గాయత్రి మెడికల్ షాపు యజమాని చొక్కాకుల శ్రీనివాస్ కలసి ఆదివారం రాజేశ్వరికి రూ.5000 విలువైన మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ 3020 డిస్ట్రిక్ మెంబెర్ షిప్ చైర్మన్ ఏవీ రంగారావు, అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాస్, రోటరీ కార్యదర్శి జవ్వాజి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



రాజేశ్వరికి మందులు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా కొనుగోళ్లు

పెనుమంత్ర: మండలంలో రబీ సీజన్‌లో 12, 123 ఎకరాల విస్తీర్ణంలో వరిపంట సాగు చేశారని మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎ జ్యోత్స్యలు ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాక్షిలో ప్రచురితమైన మందకొడిగా ధాన్యం కొనుగోళ్ల వార్తకు వ్యవసాయ అధికారులు స్పందించి వివరాలను వెల్లడించారు. 43,900 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చినట్లు గుర్తించామని వివరించారు. క్రమ పద్ధతిలో రోజుకి 1000 నుండి 1500 మెట్రిక్ టన్నుల వరకు రైతులు కోరిన మిల్లులకు నాణ్యతా ప్రమాణాలకు లోబడి కొనుగోలు చేస్తున్నామని పేర్కొన్నారు.

వికలాంగుడిని తొలగించడం దారుణం

పెనుగొండ: ఆచంటలోని ఉన్నత పాఠశాల వాచ్‌మెన్ విధుల నుంచి వికలాంగుడుని తొలగించడం దారుణమని ఆచంట మండల స్నేహభారతి వికలాంగుల సంక్షేమ సంఘ కోశాధికారి తాళ్లూరు ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆచంటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రెండు సంవత్సరాల నుంచి పనిచేస్తున్న దివ్యాంగుడైన చదలవాడ ముత్యాలరావును ఎటువంటి ఆధారాలు లేకుండా ఆరోపణలు చేసి తొలగించడం దారుణమన్నారు. ఆచంట విద్యాశాఖాధికారులు తప్పుడు రిపోర్టును హైకోర్టు రద్దు చేసిందన్నారు. షోకాజ్ నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికై నా ముత్యాలరావును విధుల్లోకి తీసుకోవాలన్నారు. సమావేశంలో సంఘ నాయకులు కాండ్రేకుల రామకృష్ణ, బీర భుజంగరావులు పాల్గొన్నారు.



ఆచంటలో నిరసన తెలుపుతున్న వికలాంగులు

ఎన్‌సీసీ క్యాంపులో ఫైర్ సర్వీసు డెమో

నరసాపురం రూరల్: మండలంలోని సీతారాంపురం గ్రామంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న 7 ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సీసీ క్యాంపులో ఆదివారం ఫైర్ సర్వీస్ డిపార్ట్‌మెంట్ డెమో నిర్వహించింది. అగ్నిప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలి? అనే విషయాన్ని ఎన్‌సీసీ విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం టి.నాగరాజు మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. క్యాంప్ కమాండెంట్, లెఫ్టినెంట్ కమాండర్ సి.రోహిత్ కుమార్ ఎన్‌సీసీ వల్ల ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారులతో పాటు, కళాశాల యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి దేశాలమ్మ జాతర ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో లాకు దిగువ చింతలతోటలో కొలువై ఉన్న శ్రీ దేశాలమ్మవారి 53వ జాతర మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ ఉత్సవాలు 25 వరకూ వారం రోజులు పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంవద్ద విద్యుత్ దీపాలంకరణలతో భారీ సెట్టింగ్‌లను ఏర్పాటుచేశారు. సోమవారం ఉదయం అమ్మవారి పుట్టింటి సభ్యులు పానకం కావిడి, నైవేద్యం సమర్పించిన అనంతరం జాతర ఉత్సవాలను ప్రారంభిస్తారు. రాత్రి ఆలయం 12 స్టేజీలపై వివిధ నృత్య కళాకారులతో జాతర ఉత్సవాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం అమ్మవారికి పుష్పాలంకరణ చేసి రాత్రి పట్టణ పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తారు. ఆదివారం సాయంత్రం మజ్జి దుర్గా సత్యేంద్ర, లక్ష్మీ దంపతులతో లక్ష మల్లెల పూజ చేయనున్నారు. ఆలయ గౌరవ అధ్యక్షులు శిడగం రామలింగేశ్వరరావు, అధ్యక్షులు వలిరెడ్డి వరహాలరావు, ప్రధాన కార్యదర్శి శిడగం చంద్రశేఖర్, కోశాధికారి వలిరెడ్డి పెద్దిరాజు, మునకాల అఖిల్ కృష్ణ సాయిరామ్, పెద్ది వీరవెంకట సత్యనారాయణ, వలిరెడ్డి ఏసుబాబు తదితరులు జాతర ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



ఆలయం వద్ద సెట్టింగ్‌లతో విద్యుత్ దీపాలంకరణ



శ్రీ దేశాలమ్మతల్లి

వైభవంగా మాచేనమ్మ, పల్లాలమ్మ జాతర

పెనుగొండ: ఆచంట మండలం పెదమల్లం మాచేనమ్మ, పల్లాలమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకూ పెద్ద వీధి ఆధ్వర్యంలో అమ్మవారి జాతర వేడుకగా నిర్వహించారు. సోమవారం రాత్రి దేవ స్థానం ఆధ్వర్యంలో పెద్ద జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు.

మందాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం

వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయాభివృద్ధికి ఏలూరుకు చెందిన యల్లా వెంకటేశ్వరరావు, కృష్ణవేణి దంపతులు విరాళం అందించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం ఆలయ ప్రాంగాణంలో రూ.10,116 అందించారన్నారు. ఈ సందర్భంగా దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.